క్లుప్తంగా

యోగ సాధన దినచర్యలో భాగం కావాలి

ఇబ్రహీంపట్నం: యోగ సాధన ప్రతి ఒక్కరి దినచర్యలో భాగం కావాలని ఎన్టీటీపీఎస్ సివిల్ విభాగం ఎస్ఈ వై.ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎస్వీసీటీ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన యోగ శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ క్రమం తప్పని యోగా సాధనతో కలిగే ప్రయోజనాలు వివరించారు. ఉద్యోగులు, వ్యాపారులు యోగాతో ఒత్తిడి జయించవచ్చన్నారు. యోగా గురువు లంకే జనార్ధన్ యోగా అభ్యాసకులతో సూక్ష్మ వ్యాయామాలు, యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంపై అవగాహన కల్పించి సాధన చేయించారు. ఏడీఈ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సోమవరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

చాట్రాయి: మండలంలోని సోమవరం గ్రామంలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలు, గృహాల్లో టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం ఉందా, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ ఎలా ఉంది, రోడ్లు ఎలా ఉన్నాయనే సమాచారాన్ని సేకరించారు. అన్ని మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు నూరు శాతం ఉంటే ఉత్తమ గ్రామంగా ఎంపిక చేయనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ బృందం సభ్యులు కె.శివకుమారి, స్వచ్ఛ భారత్ జిల్లా కో–ఆర్డినేటర్ ఉషారాణి, ప్రేమ్‌కుమార్, సురేష్ కుమార్, వేస్ట్ మేనేజ్‌మెంట్ అధికారి, డివిజినల్ పంచాయతీ అధికారి సుందరి పాల్గొన్నారు.

అక్రమ వెంచర్ నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు

మైలవరం: చంద్రగూడెం గ్రామంలో అనుమతులు లేకుండా కొంతమంది అక్రమార్కులు వెంచర్ నిర్మాణం చేపట్టారు. ఈ విషయం పంచాయతీ అధికారుల దృష్టికి రావడంతో బుధవారం దాని నిర్మాణాన్ని నిలిపివేశారు. చంద్రగూడెంలో సర్వే నంబర్లు 386/1ఏ, 389/2ఏ, 97/1ఎలో 16 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో సీఆర్‌డీఏ అనుమతి లేకుండా కొంతమంది ప్లాట్లుగా విభజించి గ్రావెల్‌తో రహదారులు ఏర్పాటు చేస్తుండగా చంద్రగూడెం పంచాయతీ కార్యదర్శి మీరా సాహెబ్, వీఆర్‌ఓ, సిబ్బంది అక్రమ లేఅవుట్ వద్దకు చేరుకుని అనుమతి పత్రాలు చూపించాల్సిందిగా తెలియజేశారు. దీనితో వారు అనుమతి పత్రాలు చూపించలేకపోయారు. సీఆర్‌డీఏ అనుమతి ఉన్నా స్థానిక పంచాయతీ కార్యాలయానికి కనీస సమాచారం ఇవ్వకపోవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి పత్రాలు, పొలానికి సంబంధించిన కాగితాలను పంచాయతీ అధికారులకు తెలియజేయాలని సూచించారు. అనుమతి లేకుండా ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. దీనితో ట్రాక్టర్లు, డ్రోజర్లు, టిప్పర్లతో చేస్తున్న పనులు నిలిపివేశారు.

ఖాతా నంబర్ల తేడాతో నష్టపోతున్నాం

తిరువూరురూరల్: టేకులపల్లిలో తమకు మంజూరు చేసిన డీ ఫారం పట్టాల ఖాతా నంబర్లలో వ్యత్యాసంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఎస్సీ రైతులు బుధవారం తిరువూరు తహసీల్దారు ఉదయభాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో తాము పంటరుణాలు పొందామని, ఇప్పుడు ఈ గందరగోళంతో లబ్ధి పొందలేకపోతున్నామని రికార్డులు సవరించి న్యాయం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

తిరువూరు: గంపలగూడెం మండలంలో సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గంపలగూడెం, పెనుగొలను, ఊటుకూరు విద్యుత్‌సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

ఇద్దరి కార్నియాల సేకరణ

తిరువూరు: గంపలగూడెంలో బుధవారం మరణించిన కొత్తా రాధమ్మ నేత్రాలను విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి ఆమె కుటుంబసభ్యులు దానమిచ్చారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి గోగిరెడ్డి కృష్ణారెడ్డి సహకారంతో రాధమ్మ నేత్రాలను కంటి ఆస్పత్రి సిబ్బంది సేకరించారు. ఖమ్మం జిల్లా మధిర మండలం బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన గంగూరు బేబీరాణి మరణించగా, ఆమె నేత్రాలను కూడా ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి లయన్స్ క్లబ్‌ద్వారా దానమిచ్చినట్లు కృష్ణారెడ్డి వెల్లడించారు.

ప్రభుత్వ ఉదాసీనత తగదు



తిరువూరులో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న నగరపంచాయతీ కార్మికులు, సుప్రజ తదితరులు

తిరువూరు: పురపాలక శాఖలో పనిచేసే ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన కోర్కెలను ఆమోదించడంలో ప్రభుత్వం ఉదాసీనవైఖరి అవలంబిస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్‌సీహెచ్ సుప్రజ విమర్శించారు. బుధవారం తిరువూరు నగర పంచాయతీలో నిరవధిక సమ్మె చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగ భద్రత లేక, అతి తక్కువ వేతనాలతో పనిచేసే కార్మికులపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి శోచనీయమన్నారు. వెంటనే వారి కోర్కెలను ఆమోదించి సమ్మె విరమింపజేయకపోతే జనజీవనం స్తంభిస్తుందని చెప్పారు. పారిశుద్ధ్య కార్మికులు సైతం సమ్మెలో పాల్గొంటున్నందున ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. కార్మికులు ధర్నా శిబిరంలో మోకాళ్లపై నిలబడి వారి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు ఎస్‌వీ భద్రం, వెంకటేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు గత ఏడేళ్లుగా ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదని, ఇప్పటికైనా వారికి కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి మూడో రోజుకు చేరింది. దీనిలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి చిన్న గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కార్మికులు ప్రజలందరికీ మంచినీరు అందేలా చూడటం, వీధి లైట్లు వెలిగేలా చూస్తున్నప్పటికీ వారి శ్రమకు తగ్గ వేతనం లేకుండా వెట్టి చాకిరి చేస్తున్నారన్నారు. వీరి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను ఆపేది లేదన్నారు. పాలకులు ఎన్నికల ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తరువాత మరో మాట చెబుతూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎస్‌ఆర్ హనుమాన్లు, నాయకులు రంగారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా కొండపల్లి మున్సిపాల్టీ ఇంజినీరింగ్ కార్మికులు బుధవారం 4వ రోజు సమ్మె కొనసాగించారు. కార్మికులకు సంఘీభావాన్ని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ తెలిపారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: ఎ.కొండూరు మండలం కంభంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత అధ్యాపకుడి పోస్టుకు అతిథి అధ్యాపక ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.రఘునీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ గణితంలో 50 శాతం మార్కుల పైబడి ఉన్న అభ్యర్థులు ఈ నెల 18లోపు నిర్ణీత ధ్రువ పత్రాలతో దరఖాస్తును కళాశాలలో అందజేయాలని కోరారు. 19వ తేదీ ఉదయం ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

అభివృద్ధికి ప్రతి కుటుంబం బాధ్యత తీసుకోవాలి

మైలవరం: అభివృద్ధి కేవలం ప్రభుత్వ పథకాలతో కాదని, ప్రతి కుటుంబం భాగస్వామ్యం తీసుకోవాలని పీ–4 మోటివేటర్ ముప్పిడి నాగేశ్వరరెడ్డి తెలిపారు. రెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో పీ–4 సమీక్ష సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పీ4 విధానం అంటే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి గ్రామాభివృద్ధికి బాధ్యత తీసుకునే ప్రజా పాలన పద్ధతి అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీలాదేవి, ఎంపీడీఓ, పంచాయతీల విస్తరణాధికారి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో 'విజిలెన్స్' తనిఖీలు

విస్సన్నపేట: స్థానిక ఎరువులు, విత్తన దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయశాఖ కమిషనరేట్ మంగళగిరి కార్యాలయ సిబ్బంది ఏడీఏ ఆర్ శశిధర్‌రెడ్డి, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఏలూరు సీఐ సీహెచ్ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎరువులు, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. 0 ఫామ్స్ లేని ఎరువులు 135.1ఎంటీఎస్ 31.20 లక్షలు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు లేని పురుగుమందులు 240 లీటర్లు 1.19 లక్షలు విలువగల వాటిని తాత్కాలికంగా అమ్మకాలు నిలుపుచేశామన్నారు. బయోస్టమ్యులెంట్స్ 352.28 లీటర్లు 3.72 లక్షలు విలువైన అమ్మకాలను పూర్తిగా నిలుపుచేశామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శశికళ, రెడ్డిగూడెం ఏఓ శ్రీనివాసరావు, ఏఈఓ ఉషారాణి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు మున్సిపాల్టీ పాలకవర్గ సమావేశం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పాలకవర్గ సర్వసభ్య సమావేశం గురువారం జరగనుంది. మున్సిపాల్టీకి ఎన్నికలు జరిగిన మూడున్నరేళ్లకు పాలకవర్గం ఏర్పడంతో మొదటి సమావేశం గురువారం ఉదయం 10గంటలకు కొలువు తీరనుందని మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చాంబర్, సమావేశం మందిరం తీర్చిదిద్దారు. కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

బాలిక అదృశ్యంపై కేసు

విస్సన్నపేట: మండలంలోని ఒక గ్రామానికి చెందిన తన కుమార్తె (17) అదృశ్యంపై బాలిక తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి బాలిక ఆచూకీ కనుగొని బాలికను తిరువూరు హోమ్‌లో ఉంచామని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టామని ఎస్ఐ రామకృష్ణ బుధవారం తెలిపారు.

పంట బీమా తప్పనిసరి

ఆగిరిపల్లి: వరి పండించే రైతులు తప్పకుండా బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జైభవాని తెలిపారు. బుధవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో పంటల బీమాపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి రైతులు పంటకు బీమా చేయించుకోవాలని ఎకరాకు రూ.840 ప్రీమియం చెల్లించాలని ఆమె తెలిపారు. అనంతరం ఈదరలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. నాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి కె.జ్యోతి ప్రియాంక, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తల్లికి వందనం అందేలా చర్యలు తీసుకుంటాం

మైలవరం: తల్లికి వందనం పథకం నగదును అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని మైలవరం నారాయణ హైస్కూల్ ఏపీఎం బి. హరీష్ తెలిపారు. ఆధార్ కార్డు నంబర్లు లేకపోవడం, సిబ్బంది పొరపాటు కారణంగా ఇది జరిగిందని చెప్పారు. ఈ నెల 30వ తేదీకి తల్లుల ఖాతాలో రూ.13వేలు జమ అయ్యేలా చూస్తామన్నారు. ఒకవేళ ఏదైనా పొరపాటు జరిగితే విద్యా సంస్థ బాధ్యత తీసుకుంటుందన్నారు. మైలవరం, రెడ్డిగూడెం మండలాల ఎంఈఓలు, జిల్లా విద్యా శాఖ కార్యాలయం ప్రతినిధి పాఠశాలను సందర్శించి ఏపీఎంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

నివేశనా స్థలాల పరిశీలన

విస్సన్నపేట: పేదలకు గత ప్రభుత్వంలో పంపిణీ చేసిన నివేశనా స్థలాలను ఆర్డీఓ కె.మాధురి బుధవారం పరిశీలించారు. గతంలో ఎంతమందికి స్థలాలు కేటాయించారు. ప్రస్తుతం ఎన్ని ఖాళీలు ఉన్నాయో పరిశీలించారు. అనంతరం మండలంలోని కొండపర్వ గురుకుల పాఠశాలను, వేమిరెడ్డిపల్లిలో 22ఎ రిజిస్టర్ నుంచి తొలగించడానికి దరఖాస్తు చేయగా ఆర్డీఓ పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ లక్ష్మీకళ్యాణి ఉన్నారు.

వార్డు సచివాలయాల తనిఖీ

తిరువూరు: తిరువూరులోని రెండు వార్డు సచివాలయాలను బుధవారం ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు నగర పంచాయతీ కమిషనర్ మనోజతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. 1, 10 వార్డు సచివాలయాల్లో క్షేత్రస్థాయి సర్వేలు, ఇతర పనులకు సిబ్బంది వెళ్లారని సచివాలయంలోని తోటి సిబ్బంది చెప్పగా, ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టం వచ్చినట్లు వెళ్లడం కుదరదని, నిబంధనలు పాటించాలని హెచ్చరించారు. విధులకు గైర్హాజరైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ మనోజను ఎమ్మెల్యే ఆదేశించారు.

సచివాలయ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు


మూలపాడులో బదిలీపై వెళ్తున్న సచివాలయ ఉద్యోగులను సత్కరించిన గ్రామస్తులు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఐదేళ్లు పాటుబడి బదిలీపై వెళ్తున్న సచివాలయ ఉద్యోగులకు మూలపాడు గ్రామస్తులు బుధవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. మూలపాడు గ్రామ ప్రజల తరఫున శాలువా కప్పి మెమొంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. వీరు ఎక్కడున్నా విధి నిర్వహణలో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని స్థానికులు మూరకొండ నాగేశ్వరరావు, మాకాని వెంకాయమ్మ, జొన్నలగడ్డ సురేంద్ర తెలిపారు.

మైలవరం: రెడ్డిగూడెం మండలం తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలో బదిలీపై వెళుతున్న సిబ్బందికి బుధవారం తహసీల్దార్ సుశీలాదేవి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం నుంచి మైలవరం మండలం, కైకలూరు మండలాలకు బదిలీ అయిన వారిలో శ్రీనివాసరావు, జానీ సాహెబ్, ధనలక్ష్మి, నీలయ్య ఉన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, సీనియర్ సహాయకులు రవికాంత్, జూనియర్ సహాయకులు వెంకటేష్, వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సాంకేతిక వృత్తివిద్యలో నైపుణ్యం పెంచుకోవాలి


మైలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు

మైలవరం: విద్యార్థులు సాంకేతిక వృత్తి విద్యలో నైపుణ్యం పెంపొందించుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు.గురునాథం తెలిపారు. మైలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురునాథం మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఏటా జూలై 16న ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం జరపాలని 2014లో ప్రకటించిందన్నారు. యువతకు ఉపాధి, చదువుకు తగ్గ పని, వ్యవస్థాపకత కోసం నైపుణ్యాలను సమకూర్చడంలో వ్యూహాత్మక ప్రాధాన్యతలివ్వాలన్నారు. సాంకేతిక వృత్తి విద్య, శిక్షణ సంస్థలకు యజమానులు, కార్మికుల సంస్థలు, విధాన నిర్ణేతలు, అభివృద్ధి భాగస్వాముల మధ్య సంభాషణకు ఒక ప్రత్యేక అవకాశాన్ని ఇస్తుందని తెలిపారు, ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్లు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎం.చెన్నారావు, ఎలక్ట్రానిక్స్ సీహెచ్ ఆషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు


చెవుటూరులో నీటి కోసం నిరసన తెలుపుతున్న మహిళలు

జి.కొండూరు: పదిరోజులుగా వాడుక నీరు లేక నరకయాతన పడుతున్నామంటూ చెవుటూరులోని లొద్ది ప్రాంతంలో మహిళలు బుధవారం రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. తమ వీధిలో యాభై కుటుంబాల వరకు ఉండగా పది రోజులుగా పంచాయతీ కుళాయిల్లో నీరు రావడంలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చుక్కనీరు లేక తాగేందుకు తెచ్చుకున్న కృష్ణా వాటర్‌నే ఇంటి అవసరాలకు వాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్నానం చేసేందుకు కూడా నీళ్లలేక పిల్లలను కొన్ని రోజులుగా స్కూళ్లకు కూడా పంపడంలేదని చెప్పారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఉన్న కుటుంబాలు నరకయాతన పడుతున్నారని తెలిపారు. చేసేది లేక మినరల్ వాటర్ కొనుగోలు చేసి ఇంటి అవసరాలకు వాడుతున్నామని వాపోయారు. గ్రామంలో రెండు బోర్లు ఉన్నా మోటార్ల కెపాసిటీ సరిపోక గ్రామం అంతటికీ సక్రమంగా నీటి సరఫరా కావడంలేదని ఆరోపించారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా తమ గోడు వినడంలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరారు.

బాల్య వివాహాల నిరోధానికి పాటుపడాలి


నూజివీడులోని గురుకుల పాఠశాలలో బాల్య వివాహాల నిరోధంపై నాటిక ప్రదర్శన

నూజివీడు: బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్రీలక్ష్మి అన్నారు. పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్, క్రాఫ్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వ్యతిరేక ప్రచారోద్యమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా పాఠశాలలో వీధి నాటికను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసి వారి అభివృద్ధికి ఆటంకం కలిగించకూడదన్నారు. పిల్లలు చదువుకునేటప్పుడు తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. బాలికలకు విద్యను అందించగలిగితే అనేక రంగాల్లో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. ఆడపిల్లలకు 18 ఏళ్ల లోపు, మగ పిల్లలకు 21 ఏళ్ల లోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇందుకు రెండేళ్ల జైలు, లక్ష రూపాయల జరిమానా విధిస్తారన్నారు. గ్రామాల్లో బాల్య వివాహం చేయాలని చూస్తే వెంటనే మహిళా సంరక్షణ కార్యదర్శికి, సెక్రటరీకి, వీఆర్వోకు తెలియజేయాలన్నారు. 1098 నంబర్‌కు, 112కి కాల్ చేసి చెప్పొచ్చన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రాజ్యలక్ష్మి, జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.రవిబాబు, సిబ్బంది కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చిన్నంపేటలో 'పొలం పిలుస్తోంది'

చాట్రాయి: నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నంపేట గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

జి.కొండూరు: ప్రస్తుతం వర్షాలు వెనకాడిన నేపథ్యంలో పత్తి పైరులో బెట్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు రెండు శాతం పోటాషియం నైట్రేట్‌ను, రెండు శాతం యూరియాను పైరు మీద పిచికారీ చేయాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మోనీషా అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చెవుటూరు, వెంకటాపురం గ్రామాలలో సాగవుతున్న పత్తి పైరును మోనీషా బుధవారం పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే మేలు

నూజివీడు: కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం మేలైన మార్గమని 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం దేశం కోసం కార్యక్రమంపై పట్టణంలో జడ్జిలు, న్యాయవాదులు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఓ అనూష, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మండల విద్యాశాఖ అధికారిని నియమించాలి

ఆగిరిపల్లి: మండల విద్యాశాఖ అధికారిని నియమించాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు మక్కే వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. గత నెలలో ఎంఈఓ–1 సర్వేశ్వరరావు పదవీ విరమణ పొందడంతో ఆ స్థానంలో ఇప్పటి వరకు వేరొకరిని నియమించకపోవడంతో నూతనంగా విధుల్లోకి వచ్చిన ఉపాధ్యాయులకు ఎరియర్స్ బిల్లులు, రెగ్యులర్ బిల్లులు ఆలస్యయ్యే అవకాశం ఉందని, వెంటనే మండల విద్యాశాఖ అధికారి–1ను నియమించాలని ఆయన కోరారు.

మామిడిలో కొమ్మ కత్తిరింపులు ముఖ్యం



నూజివీడు: మామిడి తోటల్లో కొమ్మ కత్తిరిస్తే చెట్లకు గాలి, వెలుతురు బాగా ప్రసరించి పూత బాగా రావడంతో పాటు తెగుళ్లు, పురుగుల బెడద కూడా తగ్గుతుందని మామిడి శాస్త్రవేత్త జి.శాలిరాజు పేర్కొన్నారు. నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో ఉద్యానశాఖ ఆధ్వర్యానమామిడిలో కొమ్మకత్తిరింపులు, ఎరువుల యాజమాన్య పద్ధతులపై బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ చెదురుమదురుగా ఉన్న కొమ్మలను ఏటవాలుగా కత్తిరించాలన్నారు. కొమ్మలను 15 సెంటీ మీటర్లు వెనక్కి కణుపు ముందు కత్తిరించాలన్నారు. ఉద్యాన శాఖ అధికారి ఆర్.హేమ మాట్లాడుతూ పళ్ల తోటల విస్తీర్ణ పథకం కింద మామిడి, జామ, నిమ్మ, అరటి, బొప్పాయి తదితర పంటలకు రాయితీ ఉందని తెలిపారు. ఒక రైతుకు ఒక హెక్టార్ పరిమితి అని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మునునూరు లక్ష్మీకాంతమ్మ, రైతుసేవా కేంద్రం సిబ్బంది వీహెచ్‌ఏ పి.రమేష్, రైతులు పాల్గొన్నారు.